క్లుప్తంగా

21న దివ్యాంగుల జాబ్ ఫెయిర్

గుంటూరుఎడ్యుకేషన్: సమర్ధనం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21న సాంబశివ పేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో దివ్యాంగ నిరుద్యోగులకు జాబ్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమ విద్యార్హత అని పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు గల దివ్యాంగ యువత తమ బయోడేటా, వైకల్య నిర్ధారణ ధ్రువపత్రాలు, ఆధార్ కాపీతో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే జాబ్ ఫెయిర్‌కు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 63648 67801, 6364 867802 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు మెడికల్: మహా శివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాలకు వచ్చే భక్తులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే తక్షణమే వైద్యులు, వైద్య సిబ్బంది అప్రమత్తమై మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు పేర్కొ న్నారు. శివరాత్రి సందర్భంగా జిల్లాలోని శైవ క్షేత్రాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాల తనిఖీల్లో భాగంగా ఆయన శనివారం తుళ్లూరు మండలం తాళాయపాలెం శైవ క్షేత్రంలోని వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. శిబిరంలో ఎంత మంది సేవలు వినియోగించుకున్నారు.. విధుల్లో ఉన్న సిబ్బంది, మందులు, ఇంజక్షన్లు తదితర విషయాలను పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా భక్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆదివారం భక్తులు తిరిగి వెళ్లే వరకు శిబిరాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

కోడి పందేల స్థావరంపై దాడి

గుంటూరు రూరల్: కోడి పందేల స్థావరంపై దాడిచేసి నిర్వాహకులను నల్లపాడు పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఓబులునాయుడుపాలెంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేయగా కోడి పందేలను నిర్వహిస్తున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వీరి నుంచి 11 కోళ్లు, రూ.12 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కొల్లూరులో ఏడుగురు...

కొల్లూరు: కోడి పందేల శిబిరంపై శనివారం పోలీసులు దాడులు చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. గాజుల్లంక నుంచి పోతర్లంక మార్గం వెంబడి కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో ఏఎస్ఐ కొండవీటి బాబూరావు సిబ్బందితో దాడులు చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకొని, రెండు కోళ్లు, రూ.3 వేలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని తెనాలి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

నేడు ఘంటసాల సంగీత విభావరి

తెనాలి: గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా పట్టణానికి చెందిన భారతీయ సాహితీ సంస్కృత వేదిక శ్రీ కళారంజని ఆధ్వర్యంలో ఆదివారం సంగీత విభావరిని నిర్వహించనున్నారు. కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 5 గంటలకు ప్రారంభమవుతుంది. అపర ఘంటసాలగా పేరొందిన వై.ఆర్. శాస్త్రి తన గానకళా కౌశలంతో ప్రేక్షకులను రంజింపజేస్తారని అధ్యక్షురాలు డాక్టర్ కేఎస్ఎల్ పద్మావతీదేవి, కార్యదర్శి గోనుగుంట్ల మురళీకృష్ణ తెలియజేశారు.

సాగునీటి సమాచారం

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 2423 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 137 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 190 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 218 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 12 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 206 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 1179 క్యూసెక్కులు విడుదల చేశారు.

నులకపేటలో ఉచిత వైద్యశిబిరం

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేట శివకేశవ నగర్‌లోని చైతన్యతపోవన్ రజతోత్సవాల సందర్భంగా మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. విజయవాడలోని ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో మూడు వేల మందికి పైగా పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మన్ వావిలాల రజనీకాంత్ శర్మ, వైద్యులు డాక్టర్ రవితేజ, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ మణికుమార్, డాక్టర్ సందీప్, డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు గృహసారథుల ఆత్మీయ సమావేశం

మంగళగిరి: గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు పట్టణ, రూరల్ కోఆర్డినేటర్లు మునగాల మల్లేశ్వరరావు, అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఈద్గా కమ్యూనిటీ హాల్ ఆవరణలో నిర్వహించనున్న సమావేశానికి అందరూ హాజరు కావాలని కోరారు.

హరహర మహాదేవ...

- భక్తులతో కిటకిటలాడిన పెదకాకాని శివాలయం
- ఓం నమః శివాయ నామంతో మార్మోగిన శివసన్నిధి
- భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న ప్రముఖులు


క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం వద్ద దర్శనం కోసం బయట వరకు బారులు తీరిన భక్తులు

పెదకాకాని: పెదకాకాని శివక్షేత్రం మహా శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఓం నమఃశివాయ నామంతో మార్మోగింది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులందరికీ స్వామి దర్శనం కలిగేలా ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ శివ నామం స్మరిస్తూ ప్రదక్షిణలు చేసిన భక్తులు భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులను దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణం క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయింది. మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఆలయ ప్రాంగణమంతటా శోభయమానంగా అలంకరించారు. ఒక్కరోజులో స్వామివారికి వివిధ సేవా కార్యక్రమాల ద్వారా 9,13,508 రూపాయలు ఆదాయం చేకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణం విద్యుత్ కాంతులతో కళకళలాడుతుంది. మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఆలయానికి తరలివచ్చిన వేలాది మంది భక్తులకు పెదకాకాని వర్తక సంక్షేమసంఘం, శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త ఆదినేని అంకబాబు, శివాలయం మాజీ ట్రస్టుబోర్డు సభ్యులు పెండెం విజయ్, దూపాటి వెంకట్రావుల ఆధ్వర్యంలో ఉచితంగా అన్నప్రసాద వితరణ చేశారు. అలానే కాకతీయ యూత్, ఆర్యవైశ్యసంఘం, ఆర్యవైశ్యయూత్‌ల ఆధ్వర్యంలో పులిహోర, పొంగలి, దద్దోజనము ఉదయం నుండి రాత్రి వరకూ ఉచిత ప్రసాద పంపిణీ చేశారు. దాతల సహకారంతో క్యూలైన్లలో చిన్న పిల్లలకు పాలు, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ప్రముఖుల రాక

మహా శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి హైకోర్టు న్యాయమూర్తి సుజాత, స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి దంపతులు, జేసీ జి.రాజకుమారి, విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ దంపతులు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సీనియర్ ఐపీఎస్ అధికారి ఎన్.అమ్మిరెడ్డి తదితరులు శివాలయానికి విచ్చేశారు. ప్రముఖులకు ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. భ్రమరాంబ అమ్మవారిని మల్లేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలల్లో పాల్గొన్నారు. అర్చకులు, వేదపండితులు వేద ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

ప్రత్తిపాడు: బ్రహ్మమురారి సురార్చిత లింగం.. నిర్మల భాసిత శోభిత లింగం.. అంటూ శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగిపోయాయి. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం కైలాసనాథుని కోవెలలు భక్తజనకోటితో కిక్కిరిసిపోయాయి. ప్రత్తిపాడులోని సుప్రసిద్ధ గంగా పార్వతి సమేత దండేశ్వరాలయంలో ఆలయ అర్చకులు పి.పరమేశ్వరశర్మ దండేశ్వరునికి తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు జరిపారు. ఆవులపాలు, గంధం, తేనె.. వంటి పంచామృతాలతో విశేష అభిషేకాలు చేశారు. రాత్రి శాంతి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ బాపతు నాగమోహన్ రెడ్డి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. గొట్టిపాడులోని శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంతో పాటు మండలంలోని కొత్త మల్లాయపాలెం, నడింపాలెం, వంగిపురం గ్రామాల్లోని శివాలయాల్లో మహాశివరాత్రి పర్వదిన పూజలు జరిగాయి. వేకువజాము నుంచే తల స్నానమాచరించి భక్తులు దేవాలయాలకు క్యూకట్టారు. శివరాత్రి రాకతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. చేదుకోకోటయ్యా.. చేదుకో అంటూ కోటప్పకొండకు భక్తులు ప్రభలు కట్టుకుని తరలివెళ్లారు.

లింగోద్భవకాలంలో..

శైవక్షేత్రాల్లో శివునికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. పుణ్యప్రథమైన లింగోద్భవ కాలంలో అర్చకులు పరమశివునికి అన్నాభిషేకాలను నిర్వహించారు. అన్నాభిషేక కార్యక్రమంలో పాల్గొనేందుకు భక్తులు పెద్ద ఎత్తున శివాలయాలకు చేరుకున్నారు. హర హర మహాదేవ శంభోశంకర అంటూ పరవశించిపోయారు. ప్రత్తిపాడు గంగాపార్వతీసమేత దండేశ్వరాలయం ఈఓ నరేష్ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కాకుమానులో..

కాకుమాను: మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని గ్రామాలలో శనివారం శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గంగా పార్వతి సమేత ఆగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో వేకవజాము నుంచి స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించారు. మహా శివరాత్రి సందర్భంగా స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసి గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

భక్తులతో పోటెత్తిన క్వారీ

చేబ్రోలు: హర హర మహదేవా శంభో శంకర.. చేదుకో కోటయ్యా ... అంటూ చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం వద్ద శనివారం మహాశివరాత్రి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని పరవశించారు. మహాశివరాత్రి పండుగ రోజున క్వారీ బాలకోటేశ్వరస్వామిని సుమారు లక్ష మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు అంచనా. తిరునాళ్ల సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి భక్తులు, ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలతో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసింది. చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు సుమారు 12 భారీ విద్యుత్ ప్రభలను నిర్మించారు. దేవాలయం ప్రాంగణం వద్ద వంద అడుగుల పైన ఉన్న భారీ సెట్టింగ్ విద్యుత్ ప్రభలను నారాకోడూరు యాదవ సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. చేబ్రోలు, తెనాలి పరిసర గ్రామాల నుంచి వందల సంఖ్యలో చిన్నచిన్న ప్రభలు, బాల ప్రభలు, మొక్కుబడు ప్రభలు తరలి వచ్చాయి. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, ఆటోలలో భక్తులు దేవాలయానికి తరలివచ్చారు. దర్శనం కోసం మహిళలు, వృద్ధులు, పిల్లలు భక్తులు క్యూలైన్లతో పాటు బయట వరకు బారులు తీరారు. గంటల తరబడి దర్శనం కోసం క్యూలైన్లో వేచి ఉండాల్సి వచ్చింది.

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య దేవస్థానం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా క్వారీ బాలకోటేశ్వర స్వామి తిరునాళ్ల ఏర్పాట్లను పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య ప్రత్యేక పరిశీలన చేశారు. మహాశివరాత్రి క్వారీ తిరునాళ్ల సందర్భంగా పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్వారీ బాలకోటేశ్వరస్వామి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం నారాకోడూరు యాదవ సమాజం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీపీఓ ఆర్ కేశవరెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. పంచాయతీ కార్యదర్శి వైపీఏ ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. బాలకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణం వద్ద విద్యుత్‌శాఖ అత్యవసర విభాగ కేంద్రంను, ప్రసాదాల పంపిణీ కార్యక్రమంను పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య ప్రారంభించారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ మురళీకృష్ణ యాదవ్, తెనాలి డీఈ చిరంజీవి, స్థానిక ఏఈ వెంకట సుధీర్ పాల్గొన్నారు.

పెదనందిపాడు: మహా శివరాత్రి రోజున మండల పరిధిలోని అన్ని శైవక్షేత్రాల్లో శివనామస్మరణతో మార్మోగాయి. శాంతి కల్యాణం జరిపించారు. పెదనందిపాడు బాలత్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు వడ్లమూడి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మహా రుద్రాభిషేకం

గుంటూరు రూరల్: ఎంతో పవిత్రమైన మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని రెడ్డి కళాశాల సమీపంలో లోక కలాణార్థం మహా రుద్రునికి మహా రుద్రాభిషేకం, మహా భస్మాభిషేకం జరిగింది. వేమవరం గ్రామంలోని కోటి లింగాల క్షేత్రం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా క్షేత్ర సభ్యులు, అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా సుమారు 3 టన్నుల బరువుగల మట్టితో 7 అడుగుల ఎత్తుగల మట్టి శివలింగం రూపంలో కొలువు దీరిన మట్టి శివలింగ రూపంలో కొలువుదీరిన రుద్రునికి, రుద్రాభిషేకం, మహా భస్మాభిషేకం నిర్వహించారు.


పెదకాకాని శివాలయంలో స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య


పెదకాకాని శివాలయంలో అన్నపూర్ణాదేవిగా భ్రమరాంబ అమ్మవారు


మల్లవరంలో ప్రత్యేక అలంకారంలో మహాలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు


ప్రత్తిపాడులోని దండేశ్వరాలయంలో శివునికి దివ్య హారతులిస్తున్న అర్చకులు పరమేశ్వరశర్మ


పెదకాకాని శివాలయంలో స్వామి దర్శనానికి వస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి


మట్టిరూప శివలింగానికి రుద్రాభిషేకం, భస్మాభిషేకం చేస్తున్న స్వాములు

సర్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజల్లో

హాజరైన ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: పెదపలకలూరులోని సర్వేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే సుచరిత ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదం, అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ శివాలశెట్టి రాధాకృష్ణ, ఆంజనేయస్వామి ఆదేవాలయం చైర్మన్ నూనె సత్యవతి పాల్గొన్నారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామంలో వేంచేసియున్న శివాలయంలో గుంటూరు రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. వెంగళాయపాలెంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నల్లపాడు అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మహాన్నదానం చేశారు. కార్యక్రమంలో 15 వేల మందికిపైగా భక్తులు పాల్గొన్నారు. మల్లవరంలోని గంగా పార్వతి సమేత మహాలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లోకకల్యాణార్థం శాంతి హోమం చేశారు.


పెదపలకలూరు సర్వేశ్వరాలయంలో ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదం అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు


విద్యుత్ వెలుగుల్లో గొడవర్రు గ్రామ ప్రభ



నారాకోడూరుకు చెందిన మిత్ర మండలి, గ్రామ ప్రభలు


గుండవరం గ్రామ ప్రభ


శలపాడుకు చెందిన విద్యుత్ ప్రభ

క్వారీలో ప్రభ వెలుగులు

చేబ్రోలు: మహాశివరాత్రి సందర్భంగా వడ్లమూడి క్వారీ తిరునాళ్లలో శనివారం రాత్రి భారీ విద్యుత్ ప్రభలు కాంతులు వెలుగులు నింపాయి. జిల్లాలో కోటప్పకొండ తరువాత పేరొందిన చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ తిరునాళ్లకు ఈ ఏడాది 12 భారీ విద్యుత్ ప్రభలు తరలివచ్చాయి. నారాకోడూరు నుంచి 4, చేబ్రోలు, గొడవర్రు, గుండవరం, వడ్లమూడి, శేకూరు, శలపాడు, సుద్దపల్లి గ్రామాల నుంచి విద్యుత్ ప్రభలు వచ్చాయి. వివిధ రకాల విద్యుత్ బల్బులతో ఆకర్షణీయంగా విద్యుత్ ప్రభలను తీర్చిదిద్దారు. బాలకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణం వద్ద నారాకోడూరు యాదవ సమాజానికి చెందిన వారు 111 అడుగుల ఎత్తు భారీ విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. గుండవరం, గొడవర్రు గ్రామ ప్రభలు విద్యుత్ వెలుగులతో ఆయా గ్రామాల నుంచి ఆలయానికి చేరుకున్నాయి. నారాకోడూరు మీదుగా వడ్లమూడి క్వారీ దేవాలయం వరకు వెళ్లే మార్గాల వద్ద ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. చేబ్రోలు, నారాకోడూరు, వడ్లమూడి ప్రాంతాల్లో పోలీసు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.


క్వారీ దేవాలయం ప్రాంగణం వద్ద నారాకోడూరు యాదవ సమాజం ఏర్పాటు చేసిన వంద అడుగుల విద్యుత్ ప్రభ

హాస్టల్ నిర్వాహకురాలి ఆత్మహత్య

పట్నంబజారు: హాస్టల్ నిర్వాహకురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై శనివారం కేసు నమోదయింది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని బేగర్లపూడి గ్రామానికి చెందిన చల్లగుండ్ల స్రవంతి (35)కి ఇరవై ఏళ్ల క్రితం అశోక్ అనే వ్యక్తితో వివాహం అయ్యింది. వీరు బ్రాడీపేట 1, 4 లైనుల్లో దివ్యశ్రీ బాయ్స్ హాస్టల్ నిర్వహిస్తున్నారు. హాస్టల్ సరిగా నడవక పోవటం, అప్పులు అధికమైపోవటం, అద్దెలు కూడా చెల్లించలేని పరిస్థితులు ఏర్పడటంతో నిత్యం స్రవంతి బాధపడుతూ ఉండేది. ఈ క్రమంలో స్నేహితురాలికి ఫోన్ చేసి తన పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని కోరింది. బ్రాడీపేట 1వ లైనులోని హాస్టల్ గదిలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. మృతురాలి తల్లి జంపాని శివపార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణ మహోత్సవంలో మంత్రి నాగార్జున

నెహ్రూ నగర్: మహా శివరాత్రి సందర్భంగా గుంటూరు లాడ్జి సెంటర్‌లో బ్రహ్మంగారి వీధిలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గుంటూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఉండూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకొని, కల్యాణ మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలజ్ఞానం బోధించి, సకల జనుల హితం కోరిన గొప్ప సంఘ సంస్కర్త, భవిష్యత్ దర్శిని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి అని కొనియాడారు. జీవితంలో ఒకసారైనా.. ప్రతి ఒక్కరూ బ్రహ్మంగారి మఠాన్ని సందర్శించుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉత్సవమూర్తులకు లాడ్జి సెంటర్ అమరావతి రోడ్డులో శోభయాత్ర నిర్వహించారు. భక్తులకు ప్రసాదం అందించి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం స్టేట్ జనరల్ సెక్రటరీ గట్టు శ్రీనివాసరావు, ఎర్రం బ్రాహ్మణ, రాంబాబు, గురు బ్రహ్మాచారి, రావూరి శ్రీనివాసరావు, బాల సూర్యం ఓంకార చారి తదితరులు పాల్గొన్నారు.


మంత్రి నాగార్జునను సత్కరించిన ఆలయ సిబ్బంది

మరో ఆరు మొబైల్ ఫోన్లు అప్పగింత

నగరంపాలెం: మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల సౌకర్యార్థం జిల్లా పోలీసు శాఖ అందుబాటులోకి తెచ్చిన వాట్సాప్ నంబరును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కె.ఆరీఫ్ హఫీజ్ పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ల రికవరీ ఫిర్యాదుల కోసం వాట్సాప్ నంబరు 86888 31574ను గత నెల 28న ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఆరుగురికి రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ వాట్సాప్ నంబరు ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే పదుల సంఖ్యలో బాధితులకు ఫోన్లు అప్పగించామన్నారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ నరసింహారావు పాల్గొన్నారు.

పాతమల్లాయపాలెంలో అన్నదానం

పాతమల్లాయపాలెం(ప్రత్తిపాడు): మండల పరిధిలోని పాతమల్లాయపాలెంలో అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయ అర్చకులు స్వామివారిని సుందరంగా అలంకరించిపూజలు నిర్వహించారు. అన్నదానంలో భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు.